
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3 సిద్దిపేట

గురువారం 18 జూలై 2024

బతుకుదెరువు కోసం వెళ్తే..
చిన్నారిని చిదిమేసిన
వీధి కుక్కలు 5
● కుటుంబంలో విషాదం

# సంగారెడ్డిలో ఘనంగా పీర్ల పండుగ



## హాజరైన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 17: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో పీర్ల పండుగ బుధవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని ఉప్పర్ బజార్ వద్ద జరిగిన మొహర్రం కార్యక్రమాలను తిలకించేందుకు పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన పిల్లలు, పెద్దలు కులమతాలకతీతంగా భారీ సంఖ్యలో తరలివచ్చారు. పీర్ల ఊరేగింపులో పాల్గొన్న జగ్గారెడ్డి ఆటలాడుతూ ప్రజలను ఉత్తేజపరిచారు. పట్టణంలోని పాత బస్టాండ్, సినిమా రోడ్, నాల్‌సాబ్‌గడ్డ, రిక్షా కాలనీ తదితర ప్రాంతాల్లో పీర్లను ఊరేగించారు. మొహర్రంను పురస్కరించుకుని ముస్లిం మత పెద్దలు జగ్గారెడిని ఘనంగా సన్మానించారు.

◄ పీర్ల ఊరేగింపులో ముస్లింలతో జగ్గారెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి





అదనపు వసూళ్లకు

## ఫుల్‌స్టాప్

5

● మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ చెల్లింపులు
● క్యూఆర్ కోడ్‌తో నిర్దేశిత రుసుము వసూలు
● తీరనున్న వినియోగదారుల ఇబ్బందులు
● కమీషన్ పెంచాలంటున్న నిర్వాహకులు

# తొలి ఏకాదశి సందడి

ఏకాదశి హిందువులకు అత్యంత ముఖ్యమైన తిథి. ఏడాది పొడవునా వచ్చే ఏకాదశుల్లోకెల్లా ఆషాఢమాసంలో వచ్చే ఏకాదశి ప్రత్యేకం. ఈ పండుగను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా బుధవారం సందడి నెలకొన్నది. తెల్లవారుజాము నుంచే వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దిపేటలోని మోహినిపుర వేంకటేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో పూజలు, హోమాలు, ప్రవచనాలు చేశారు.

మరిన్ని వార్తలు 6లో..





సిద్దిపేటలోని మోహినిపుర వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు




పరిహారం ఇవ్వరు..

## పనులు చేయరు

● రూ.290 కోట్ల అంచనాలతో 9 కిలోమీటర్ల కాలువ నిర్మాణం 5
● రైతుల నుంచి 120 ఎకరాల భూ సేకరణ
● ప్రభుత్వం మారడంతో నిలిచిన పనులు
● పరిహారం కోసం ఎదురుచూపులు



నిలిచిన కాలువ నిర్మాణ పనులు



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ముహూర్తం రానే వచ్చింది. రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేసే తరుణం ఆసన్నమైంది. తొలి విడతగా రూ.లక్ష లోపు రుణం పొందిన రైతుల ఖాతాల్లో నేడు నగదు జమ చేస్తామని ప్రకటించింది. సాయంత్రం 4గంటల వరకు వీరి ఖాతాల్లోకి మాఫీ సొమ్ము పడుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతు వేదికల్లో సంబరాలు నిర్వహించడానికి వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా వీడియో కాన్ఫరెన్సు ద్వారా రైతుల అభిప్రాయాలను వినబోతున్నారు.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 17

# రుణమాఫీకి వేళాయె

● రూ.లక్ష లోపు రుణగ్రస్తులకు తీపికబురు
● నేడు సాయంత్రం 4 గంటలకు ఖాతాల్లోకి..
● సంబరాలకు రైతువేదికలు ముస్తాబు
● ఉమ్మడి జిల్లాలో 1,52,270 మంది రైతులకు లబ్ధి
● రెండో దశపై మిగతా వారి ఆశలు

బ్యాంకుల ద్వారా 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 13వరకు రూ.2లక్షల లోపు రుణం పొందిన రైతులను రుణమాఫీ అర్హులుగా తేల్చడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 5లక్షల మంది ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇందులో తొలి విడతగా లక్ష లోపు రుణం పొందినవారికి నేడు లబ్ధి చేకూరనున్నది. ఈ జాబితాలో ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి 1,52,270 మంది ఉన్నట్లుగా వ్యవసాయశాఖ అధికారికంగా ప్రకటించింది.

### పాస్‌బుక్కే ప్రామాణికంగా..

ప్రస్తుత జాబితా ప్రకారం వ్యవసాయ భూమికి సంబంధించిన పాస్‌బుక్‌నే ప్రామాణికంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ జాబితాలో 2 నుంచి 3 ఎకరాల భూమి ఉన్నవారే ఎక్కువగా ఉండడంతో పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. రూ.లక్ష లోపు రుణం పొందినవారిలో చిన్న, సన్నకారు రైతులే ఉండడం ఈ జాబితా తయారీకి సులభతరమైంది. ఇక రూ.2 లక్షల లోపు రుణం పొందినవారిలో ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారుల సంఖ్య అధికంగా ఉండడంతో ఆ జాబితాపై తర్జనభర్జన పడుతున్నారు. ఒక కుటుంబానికి రూ.2లక్షల లోపు రుణమాఫీ జరుగుతుందని అధికారికంగా ప్రకటించడంతో ఆయా కుటుంబాల్లోని ఖాతాలను పరిశీలిస్తున్నారు. తగిన పరిస్థితుల్లో రేషన్‌కార్డును సైతం పరిగణనలోకి తీసుకోబోతున్నారు. తొలి విడత రుణమాఫీ సొమ్ము జమ కానుండటంతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతోంది. ఆగస్టు 15లోగా తుది జాబితా రైతులకు లబ్ధి చేకూరుతుందని ప్రకటించడంతో ఆ వర్గం ఆసక్తితో ఎదురుచూస్తోంది.

### సంబరాలకు సన్నద్ధం..

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత ఎన్నికల సమయంలో ఈ హామీ ఎక్కువ మంది రైతులను ఆకర్షించింది. అప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూ రూ.లక్ష వరకు రుణమాఫీ చర్యలను కొనసాగించింది. కానీ, సంక్షేమ పథకాలతోపాటు రూ.2లక్షల వరకు రుణమాఫీ అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించడం ఆ పార్టీ విజయానికి కలిసివచ్చింది. అన్నట్లుగానే రూ.2లక్షల వరకు రుణాన్ని మాఫీ చేయడానికి మార్గదర్శకాలు విడుదల చేశారు. తొలిదశగా నేడు రూ.లక్ష వరకు రుణం పొందిన వారి ఖాతాల్లో సొమ్ము జమచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో సంబరాలు నిర్వహించేలా కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ప్రతీ రైతు వేదికలో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. రైతులంతా సంబరాల్లో ఉండగానే సాయంత్రం 4 గంటలకు వారి ఖాతాల్లో నగదు జమ అవుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ రైతు వేదికల్లో ఉన్న రైతులతో మాటామంతీ జరుపుతారు.

**జిల్లాల వారీగా నేడు లబ్ధి పొందే రైతులు**

| | |
|---|---|
| సంగారెడ్డి | 51,164 |
| సిద్దిపేట | 53,128 |
| మెదక్ | 47,978 |
| మొత్తం | 1,52,270 |



గజ్వేల్‌లోని మాతాశిశు ఆసుపత్రి

మాతాశిశు ఆసుపత్రిలో

# పూర్తిస్థాయి సేవలెప్పుడు?

● చిన్న కారణంతో ప్రారంభానికి నోచుకోని భవనం
● ఇరుకు గదుల్లో గర్భిణులు, బాలింతలకు తిప్పలు
● అధికారులు దృష్టిసారించాలని ప్రజల వేడుకోలు

గజ్వేల్, జూలై 17 : గజ్వేల్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మాతాశిశు ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చేలా కనిపించడం లేదు. గత ప్రభుత్వం రూ.27.35కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాన్ని 2023 అక్టోబరు 3న అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఆసుపత్రిని ప్రారంభించి దాదాపు 10నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి రాలేదు. ఫలితంగా జిల్లా ఆసుపత్రిలో ఇరుకుగదుల్లో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. హైరిస్క్ కేంద్రాన్ని మాతాశిశు ఆసుపత్రికి తరలిస్తే జిల్లా ఆసుపత్రిలో మరిన్ని వైద్యసేవలు అందే అవకాశం ఉంది. కాగా మాతాశిశు ఆసుపత్రిని ప్రస్తుతం ఓపీ, పరీక్షలకు వినియోగిస్తున్నారు.

### చిన్న కారణంతోనే..

కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆసుపత్రి భవనం చిన్న కారణంతో పూర్తిసేవలు అందుబాటులోకి రావడం లేదు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రిలో ఓటీ (ఆపరేషన్ థియేటర్), లేబర్ రూంలో కావాల్సిన పరికరాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడమే ఇందుకు కారణం. గతంలో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంతో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు స్పందించి ఆసుపత్రిని పరిశీలించినా, ఎలక్షన్ కోడ్ కారణంగా నిధులు విడుదల కాలేదు. ఎలక్షన్ కోడ్ తొలగి 40 రోజులు గడుస్తున్నా ఆసుపత్రికి కావాల్సిన నిధులు ఇతరత్రా అవసరాలపై అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ ఆసుపత్రి ప్రారంభమైతే చిన్న పిల్లలకు ఎన్ఐసీయూ సేవలు సైతం అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.

### ఆసుపత్రి అందుబాటులోకి వస్తే తీరనున్న తిప్పలు

ప్రస్తుత జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. హైరిస్క్ కేంద్రం ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలోనే కొనసాగుతుంది. ఆసుపత్రిలో ప్రతి నెలా దాదాపుగా 400 ప్రసవాలు జరుగుతుండగా, ప్రతి రోజు దాదాపుగా వంద మందికి పైగా గర్భిణులు వైద్యసేవల నిమిత్తం వస్తుంటారు. ఈ నేపథ్యంలోనే పేషంట్ల రద్దీతో ఆసుపత్రి ఇరుకుగా మారింది. ఈ క్రమంలోనే నూతన భవనంలోకి ఆసుపత్రిని మారిస్తే ఇబ్బందులు తొలిగే అవకాశాలున్నాయి. ప్రస్తుత ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తే ప్రసుతీల సంఖ్య, చిన్నపిల్లల వైద్యం మరింత చేరువయ్యే అవకాశాలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

**పరికరాలు రావాల్సి ఉంది**

**– సాయికిరణ్, సూపరింటెండెంట్, గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి**



మాతాశిశు ఆసుపత్రి భవనం పూర్తి స్థాయిలో సేవలందించేందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతానికి ఔట్ పేషంట్ సేవలు, ఆయా రకాల టీకాలు, పరీక్షలు, స్కానింగ్‌లు చేస్తున్నాం. ఆపరేషన్ థియేటర్‌లో పరికరాలు రావాల్సి ఉంది. ఇప్పటికే ప్రభుత్వం బడ్జెట్‌ను సైతం విడుదల చేసింది. ఆ పరికరాలు ఇతర రాష్ట్రాల నుంచి రావాల్సి ఉండగా నిత్యం ఆరా తీస్తున్నాం. మరికొన్ని రోజుల్లో ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తాం.

# మల్లన్న ఆలయంలో నిఘా డొల్ల!

● సీసీ కెమెరాలలో చిక్కని బంగారు ఆభరణాల మాయాజాలం
● ఫుటేజీల పరిశీలనలో కానరాని ప్రయోజనం

చేర్యాల, జూలై 17 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాధికారుల నిర్లక్ష్యంతో ఆలయంలో నిఘా డొల్లతనం మరోమారు నిరూపితమైంది. ప్రధానమైన పలు సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై ఆలయవర్గాల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయం, కార్యాలయంతో పాటు పరిసరాల్లో 48 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని గొప్పలు చెబుతున్నా.. సంక్లిష్ట పరిస్థితుల్లో ఏ మాత్రం ప్రయోజనం కానరావడం లేదు.

స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించే ముఖమండపంలో గతంలో 4 సీసీ కెమెరాలు బిగించారు. వీటిలో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన రెండింటిని పట్టించుకునే నాథుడే లేడు. ఈ నేపథ్యంలో మంగళవారం చేపట్టిన లెక్కింపుల్లో గొలుసు, ఉంగరం అపహరణకు గురవగా గొలుసు మాత్రం చెత్తకుప్పలో లభ్యమైన విషయం తెలిసిందే. ఉంగరం మాత్రం దొరకలేదు. ముఖమండపం మొత్తం కనపడేలా ఆలయాధికారులు కూర్చున్న వెనుకగోడకు, ఈవో కార్యాలయానికి వెళ్లే మార్గంలో, ఎదురుగా, లిఫ్ట్‌పరిసర ప్రాంతాలు పడేలా మొత్తం నాలుగు కెమరాలు బిగించారు. ఆ సీసీ ఫుటేజీలను పరిశీలిస్తే అపరణకు పాల్పడిందో ఎవరో తెలుసుకోవచ్చని అంతా భావించారు. బుధవారం పోలీసు సిబ్బంది సమక్షంలో ఆయా ఫుటేజీలు పరిశీలించగా ఆలయాధికారులు కూర్చున్న ప్రాంగణం కనపడే ప్రధానమైన కెమెరాలు పనిచేయకపోవడంతో ఎలాంటి ప్రయోజనం కానరాలేదు. కెమెరా బిగించినప్పటికీ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఇంటిదొంగను పట్టుకోలేని పరిస్థితి. ఆయా ప్రధాన కెమెరాలు పనిచేయని విషయాన్ని తెలిసిన ఆలయవర్గాలు హుండీ లెక్కింపులు చేపట్టిన ప్రతీసారి ఇదేవిధంగా దొంగతనానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

### ఏఈవో గంగా శ్రీనివాస్‌పై ఈవో ఫిర్యాదు

మంగళవారం జరిగిన హుండీలెక్కింపుల్లో చోటుచేసుకున్న ఉదంతంపై ఏఈవో గంగా శ్రీనివాస్‌పై అనుమానం ఉందంటూ ఆలయ ఈవో బాలాజీశర్మ కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే గంగా శ్రీనివాస్‌పై పలు అవినీతి ఆరోపణలతో పాటు ఇటీవల జాతరలో దర్శన పాస్‌ల విక్రయ తతంగం, ఇతరత్రా అభియోగాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బంగారు ఆభరణాల మాయాజాలం విషయంలో పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది చర్చనీయాంశమైంది.



పని చేయని సీసీ కెమెరా

## వెంకట ఖ్వాజా ఆశ్రమంలో సప్త భజన ప్రారంభం

వట్‌పల్లి, జూలై 17: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన వట్‌పల్లిలోని వెంకట ఖ్వాజా ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపక పీఠాధిపతి అప్పగారి 109వ జయంతిలో భాగంగా బుధవారం మొదటిరోజు సప్తభజన ప్రారంభించారు. ఈ నెల 24వ తేదీవరకు సప్త భజన కొనసాగుతుందని, చివరిరోజు డోలారోహణం కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భోజనం, మంచినీటి వసతి ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు వెంకటరెడ్డి రాములు చిస్తీ తెలిపారు.

## అరుణాచలం వెళ్లే బస్సును సద్వినియోగం చేసుకోవాలి: డీఎం



ఖేడ్‌లో అరుణాచలం వెళ్లడానికి టికెట్ బుక్ చేసుకున్న వారికి అందిస్తున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్, జూలై 17: ఈనెల 21న గురు పౌర్ణమిని పురస్కరించుకుని నారాయణఖేడ్ నుంచి అరుణాచలానికి ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నందున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం మల్లేశయ్య కోరారు. బుధవారం అరుణాచలంకు టికెట్ బుక్ చేసుకున్న వారికి బస్టాండ్‌లో ఆయన రషీదులు అందించారు. అనంతరం 19న శుక్రవారం సాయంత్రం నారాయణఖేడ్ నుంచి బస్సులు బయలుదేరి, 20న కాణిపాకంకు, వేలూరు గోల్డెన్ టెంపుల్‌కు చేరుకుంటాయన్నారు. అదేరోజు సాయంత్రానికి అరుణాచలం చేరుకుంటారని పేర్కొన్నారు. 21న గురు పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షణ, అక్కడి నుంచి జోగులాంబ శక్తి పీఠం దర్శించుకున్న అనంతరం 22న నారాయణఖేడ్ చేరుకుంటారన్నారు. రానుపోను బస్సు చార్జీలు ఒక్కొక్కరికి రూ.4,500 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ పాండు, బీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 'ఆభా' ఓపీ సేవల్లో సంగారెడ్డి జీజీహెచ్ నంబర్ వన్

సంగారెడ్డి అర్బన్, జూలై 17: సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి 'ఆభా' యాప్ ద్వారా ఔట్ పేషెంట్ (ఓపీ)సేవల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని సంగారెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జి.అనీల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విషయాన్ని వెల్లడించారు. గత మే నెలలో ఆస్పత్రిలో ఆభా(ఏబీహెచ్ఏ-ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్, టోకెన్ సిస్టమ్ ద్వారా మొబైల్ ఓపీ రిజిస్ట్రేషన్ చేసే సరికొత్త విధానాన్ని రోగులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. దీని ద్వారా వైద్య సేవలకు వచ్చే రోగి వరుసలో గంటల తరబడి నిలబడే అవసరం లేకుండా నేరుగా టోకెన్ ద్వారా ఓపీ చికిత్సలు పొందే ఆస్కారం ఏర్పడిందన్నారు. నిత్యం ఓపీ ద్వారా సుమారు 1500 మంది రోగులు ఓపీ ద్వారా వైద్య సేవలు పొందుతుండగా, అందులో ఆభా యాప్ ద్వారా సుమారు 700 మంది ఓపీ రిజిస్ట్రేషన్ నమోదవుతుందన్నారు. ఈ నేపథ్యంలో జీజీహెచ్ రాష్ట్రంలో నంబర్ వన్‌గా ఎంపిక చేశారన్నారు. ఇందులో వైద్య సిబ్బంది కృషి, సహకారం చాలా ఉందన్నారు.


బోల్తాపడిన డీసీఎం

## అదుపుతప్పి డీసీఎం బోల్తా

● పట్టుబడిన రేషన్ బియ్యం

కొండపాక, జూలై 17: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం డీసీఎం బోల్తాపడడంతో పోలీసులకు పట్టుబడ్డాయి. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం కొండపాక మండలం దుద్దెడ శివారులో మూలమలుపు వద్ద బోల్తా పడింది. డీసీఎంలో ఉన్న బియ్యం బ్యాగులన్నీ కిందపడి చెల్లా చెదురయ్యాయి. వాటి గురించి ఆరాతీయగా రేషన్ బియ్యంగా తేలింది. సంఘటనా స్థలానికి త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ చేరుకొని విచారణ చేశారు. సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల నుంచి వికారాబాద్‌కు అక్రమంగా తరలిస్తుండగా డ్రైవర్ రాజు అతివేగంగా నడపడంతో అదుపుతప్పి బోల్తా పడింది. రేషన్ బియ్యాన్ని జిల్లెల్ల గ్రామానికి చెందిన తాళ్ల రాజు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్మేందుకు డీసీఎం ఓనరు పాండు, క్లీనర్ బెల్లె నితిన్‌కుమార్‌తో కలిసి అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో డీసీఎం బోల్తాపడడంతో డ్రైవర్ రాజు, క్లీనర్ నితిన్‌కుమార్ గాయపడ్డారు. డీసీఎంలోని 140 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆకట్టుకున్న గరికపాటి ప్రవచనాలు


కాశీ పీఠాధిపతి చంద్రశేఖర శివాచార్యులకు జ్ఞాపికను అందజేస్తున్న పద్మశ్రీ గరికపాటి నరసింహారావు

సదాశివపేట, జూలై 17: పట్టణంలోని బసవసేవాసదన్, చౌకీమఠంలో కాశీ పీఠాధిపతి డాక్టర్ చంద్రశేఖర శివాచార్య పర్యవేక్షణలో నిర్వహిస్తున్న శివపంచాక్షరి-కోటిజపయజ్ఞ, ఇష్టలింగాచర్చన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి మహాసహస్ర అవధాని-పద్మశ్రీ గరికపాటి నరసింహారావుచే ఆధ్యాత్మిక, జ్ఞాన, సేవా, మానవత్వం, కుటుంబం-సమాజంలో విలువలు వంటి అనేక అంశాలపై అందించిన ప్రవచనాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గరికపాటి మాట్లాడారు. ఓం నమఃశివాయ అనే పంచాక్షరి మంత్రం సర్వ శ్రేయస్కరమన్నారు. మహాత్మ బసవేశ్వరుడు మానవతావాది అని, అందరినీ భక్తిమార్గంలో నడిపిన మహనీయుడన్నారు. బసవేశ్వరుడి అడుగుజాడల్లో నడవాలన్నారు. సదాశివపేట వీరశైవ సమాజం-చౌకీమఠం ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమని గరికపాటి కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేల సంఖ్యలో భక్తులు, మహిళలు, వీరశైవ సమాజం చౌకీమఠం అధ్యక్షుడు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం పాల్గొన్నారు.

## వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించిన న్యాయాధికారి

నర్సాపూర్, జూలై 17: నర్సాపూర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద ఓ అనాథ వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని స్థానికులు న్యాయాధికారి కె.అనితకు మండల లీగల్ కమిటీ ద్వారా సమాచారమందించారు. వెంటనే స్పందించి వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. రుస్తుంపేటకు చెందిన వృద్ధుడి స్థిరాస్తిని సమీప బంధువులు లాగేసుకుని గెంటేశారు. దీంతో కొన్నేళ్లుగా నర్సాపూర్‌లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ విషయమై విచారించి ఆస్తిని కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయాధికారి అనిత ఎస్ఐ పుష్పరాజ్‌ను ఆదేశించారు. ఇదిలా ఉండగా తొలిఏకాదశి సందర్భంగా నర్సాపూర్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అనిత స్థానిక శివాలయంలో కుటుంబీకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పరిహారం ఇవ్వరు.. పనులు చేయరు

● రూ.290 కోట్ల అంచనాలతో 9 కిలోమీటర్ల కాలువ నిర్మాణం

● రైతుల నుంచి 120 ఎకరాల భూ సేకరణ
● ప్రభుత్వం మారడంతో నిలిచిన కాలువ నిర్మాణ పనులు
● పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు


కుకునూరుపల్లి మండలం లకుదారం శివారులో నిలిచిన కాలువ పనులు

కుకునూరుపల్లి, జూలై 17: గత కేసీఆర్ ప్రభుత్వం మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు లింకు కాలువల ద్వారా నీటిని తరలించాలనే కృత నిశ్చయంతో కాలువ నిర్మాణ పనులను ప్రారంభించింది. 2022 సంవత్సరంలో రూ.290 కోట్ల అంచనాలతో 9 కిలోమీటర్ల మేర ఈ కాలువ నిర్మాణాన్ని చేపట్టారు. నిర్మాణ బాధ్యతలను కావేరి ఇంజనీరింగ్ అనే ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. దీనికోసం ఐదు గ్రామాల రైతుల నుంచి భూమిని సేకరించి పనులను మొదలుపెట్టారు.


కూలీలు, సామగ్రి కోసం నిర్మించిన గృహాలు

### ఐదు గ్రామాలు.. 200 ఎకరాలు

వరంగల్ జిల్లా ధర్మాసాగర్ నుంచి బొమ్మకూర్ రిజర్వాయర్, బొమ్మకూర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోస్తున్నారు. ధర్మసాగర్ దాదాపు 80 కిలోమీటర్ల దూరం కావడంతో పక్కనే ఉన్న మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు తరలించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 9 కిలోమీటర్ల లింకు కాలువ నిర్మాణాన్ని చేపట్టింది. దీనికి సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలంలోని మంగోల్, కోనాయిపల్లి, మెదినీపూర్, లకుడారం, తపాస్‌పల్లి రైతుల నుంచి 200 ఎకరాల భూమి అవసరం ఉండగా.. 120 ఎకరాలను సేకరించి పనులు ప్రారంభించారు. 200 మీటర్ల సొరంగం పనులు, రెండు కిలోమీటర్లు కాలువ నిర్మాణ పనులు జరిగాయి. కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.16 లక్షల పరిహారం అందజేస్తామని చెప్పింది. కానీ మూడేళ్లవుతున్నా.. ఇప్పటివరకు ఒక్క రైతుకు కూడా పరిహారం అందించలేదు. ఐదు గ్రామాల రైతులకు దాదాపు రూ.30 కోట్ల పరిహారం రావాల్సి ఉన్నది.

### ప్రభుత్వం మారడంతో నిలిచిన పనులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ లింకు కాలువ నిర్మాణాన్ని చేపట్టింది. కానీ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో ఆరు నెలలుగా కాలువ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. నిధుల లోటుతోనే పనులు ఆగినట్లు తెలుస్తున్నది. నిర్మాణ పనుల కూలీల కోసం, నిర్మాణ సంస్థ వాహనాలు, సామగ్రి కోసం లకుడారం, మెదినీపూర్ గ్రామాల శివారులో తాత్కాలిక వసతులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పనులు నిలిచిపోవడంతో సామగ్రిని, వాహనాలను ఇక్కడి నుంచి తరలించారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ కాలువ నిర్మాణ పనులను చేపడుతుందో.. లేదో వేచి చూడాలి.

### తహసీల్దార్ నుంచి మంత్రివరకు విన్నపాలు

కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు మండలస్థాయిలో ఉండే తహసీల్దార్ మొదలుకుని, ఆర్డీవో, కలెక్టర్, అప్పట్లో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇప్పుడు నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అయినా రైతులకు పరిహారం అందలేదు. అధికారులు, ప్రభుత్వం స్పందించి పరిహారాన్ని అందజేయాలని కోరుతున్నారు.

### త్వరగా భూ పరిహారం అందజేయాలి



నాకు ఉన్న 2 ఎకరాల వ్యవసాయ భూమిలో ఎకరం భూమిని కాలువ నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం ఇచ్చాను. కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు. ప్రభుత్వం స్పందించి భూ పరిహారాన్ని అందజేయాలి.

- జిల్ల నర్సింహులు, భూ బాధితుడు, లకుడారం

### ప్రతిపాదనలు పంపాం

కాలువ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల వివరాలను ప్రభుత్వానికి అందజేశాం. నిధులు రాగానే పరిహారం పంపిణీ చేస్తాం.

- మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్, కుకునూరుపల్లి

## యూనిఫామ్ కుట్టు కూలి నిధులు విడుదల

● సంగారెడ్డి జిల్లాకు రూ.51,15,900 మంజూరు



సంగారెడ్డి అర్బన్, జూలై 17 : సర్కారు బడుల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల 2024-25 విద్యా సంవత్సరానికిగాను యూనిఫామ్‌ల కుట్టు కూలికి సంబంధించిన నిధులను విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు సంగారెడ్డి జిల్లాకు రూ.51,15,900 మంజూరు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యూనిఫామ్‌లకు సంబంధించి అవసరమైన వస్త్రాన్ని ప్రభుత్వమే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సరఫరా చేసింది. ఎంపిక చేసిన స్వయం సహాయక మహిళలకు ఆ వస్త్రాన్ని అందజేసి యూనిఫామ్‌లను కుట్టించారు. జిల్లా వ్యాప్తంగా 1,215 ప్రభుత్వ పాఠశాలల్లో 1,02,318 మంది విద్యార్థులకు ఒక జతకు రూ.50 చొప్పున ప్రభుత్వం రూ.51,15,900 నిధులను ప్రభుత్వం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను యూనిఫామ్‌లు కుట్టిన స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేయనున్నారు. అయితే ఇటీవల కుట్టు కూలీ చార్జీలను ప్రభుత్వం ఒక జతకు రూ.75 పెంచినప్పటికీ ప్రభుత్వం మాత్రం రూ.50 చొప్పున మాత్రమే విడుదల చేయడం గమనార్హం.

## ఖాళీ ఏర్పడిన పోస్టుల్లో ఎస్జీటీలకు పదోన్నతులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్

నారాయణఖేడ్, జూలై 17: ఉపాధ్యాయులకు సంబంధించి ఖాళీ ఏర్పడిన పోస్టుల్లో ఎస్జీటీలకు పదోన్నతులు ఇచ్చి, భర్తీ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం నారాయణఖేడ్‌లో సంఘం జిల్లా ఆఫీస్ బేరర్ల రీజినల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 9 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బదిలీలను చేపట్టడం అభినందనీయమన్నారు. బదిలీ అయిన ఎస్జీటీలను వెంటే రిలీవ్ చేయాలన్నారు. అవసరాల మేరకు వీవీలను నియమించాలన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, ఈఎల్స్ సరెండర్ తదితర బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. నాలుగు డీఏలను ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కాశీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, నాయకులు ఏశప్ప పాల్గొన్నారు.


హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆచార్య డాక్టర్ సుభాష్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## సమాజం కోసం పరితపించే సామాజికవేత్త ఆచార్య డాక్టర్ సుభాష్

● ఆచార్య సుభాష్ పార్థివ దేహానికి కేటీఆర్, ఎమ్మెల్యే కేపీఆర్‌ల నివాళి

దుబ్బాక, జూలై 17: పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమస్యలపై నిరంతరం పరితపించి, జీవితాంతం పోరాటం చేసిన వ్యక్తి డాక్టర్ కారంపురి సుభాష్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్య డాక్టర్ సుభాష్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో మృతిచెందిన విషయం తెలిసిందే. బుధవారం ఆయన పార్థివ దేహాన్ని సన్నిహితుల సందర్శనార్థం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉంచారు. అనంతరం దుబ్బాకలోని నివాసానికి తీసుకొచ్చి, తన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు చేశారు. హైదరాబాద్‌లో సుభాష్ పార్థివదేహాన్ని సందర్శించిన కేటీఆర్ నివాళులర్పించారు. అనంతరం ఆయన సతీమణి శశికళ, కుమారులు సుజయ్, సుశీల్‌లను పరామర్శించారు. దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సుభాష్ పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అంతేగాక మాజీ ఎంపీపీ శ్రీరాం అనసూయ, సీనియర్ నాయకులు ఆర్.రాజమౌళి, మాజీ సర్పంచ్ శ్రీరాం రవీందర్, చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్లు బోడ శ్రీనివాస్, ఆలేటి చంద్రమౌళి, పద్మశాలి సంఘం, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.


దుబ్బాకలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

## వరుణుడి కటాక్షం కోసం.. చిర్రగోనే ఆట

శివ్వంపేట, జూలై 17 : కార్తెలన్నీ ముగుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక వానాకాలం పంటల సాగు ముందుకు సాగక నార్లు ముదిరిపోతున్నాయి. వర్షాలు కురవాలని మండల కేంద్రమైన శివ్వంపేట చింతల్ మైదానంలో తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని వరుణుడిని ప్రార్థిస్తూ పలువురు యువకులు చిర్రగోనే ఆడారు. ఈ సందర్భంగా యువకులు దుర్గేష్, పోచయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షాలు ఆలస్యం అయితే చిర్రగోనే ఆడితే పడుతాయని నమ్మకంతో ఆడుతామని చెప్పారు. వరుణ దేవుడి కరుణతో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరారు.


శివ్వంపేటలో వర్షాల కోసం చిర్రగోనే ఆడుతున్న యువకులు

# అదనపు వసూళ్లకు ఫుల్‌స్టాప్

● మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ చెల్లింపులు
● క్యూఆర్ కోడ్‌తో నిర్దేశిత రుసుమే వసూలు
● తీరనున్న వినియోగదారుల ఇబ్బందులు
● కమీషన్ పెంచాలంటున్న నిర్వాహకులు

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 17: వినియోగదారులకు సులభంగా సేవలందించాలనే లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో 2011లో ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో 209 కేంద్రాలు ఉన్నాయి. మహిళా శక్తి ద్వారా మరో 29 కొత్తగా రానున్నాయి. మీసేవ కేంద్రాల్లో ఏ సర్టిఫికెట్‌కైనా దాదాపు రూ.100 తీసుకోవాల్సి ఉంటుంది. కానీ కొందరు నిర్వాహకులు రూ.120 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధిక వసూళ్లకు అడ్డుకట్ట వేసేందుకు మొదట మీ సేవ కేంద్రాల్లో రెవెన్యూ సేవలన్నింటికీ నగదు రహిత చెల్లింపులు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జూలై 1 నుంచి ఈ విధానం అందుబాటులోకి వచ్చింది. అంతకుముందే ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసింది. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో ప్రైవేట్ కేంద్రాల్లోనూ క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా రుసుము వసూలు చేయాలని ఉత్తర్వులు జారీఅయ్యాయి. దీంతో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు స్కానర్లు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్ చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది.

### రానున్న రోజుల్లో అన్ని సర్టిఫికెట్లకు..

మీ సేవ కేంద్రాల్లో రెవెన్యూకు సంబంధించి ఏ సర్టిఫికెట్‌కైనా క్యూ ఆర్ కోడ్ ద్వారానే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. నిర్వాహకులు స్కాన్ చేయగానే ఎన్ని డబ్బులు చెల్లించాల్సి ఉంటుందో అన్నే డెబిట్ అవుతాయి. రానున్నరోజుల్లో అన్ని సర్టిఫికెట్లకు క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు జరిపే విధంగా చర్యలు తీసుకుంటుంది.

### సెప్టెంబరు నుంచి ఎల్-1 డివైజ్‌ల వినియోగం

ఏ ప్రభుత్వ పథకానికైనా ఈ-కేవైసీ తప్పనిసరి. బయోమెట్రిక్ డివైజ్‌ల ద్వారా వేలిముద్రలు తీసుకుంటారు. నూతనంగా మీ సేవ కేంద్రాలకు కొత్త పరికరాలు ఏర్పాటు చేయాలని యూఐడీఏఐ ఆదేశాలు జారీచేసింది. మీ సేవ కేంద్రాల్లో ప్రస్తుతమున్న బయోమెట్రిక్ డివైజ్‌ల స్థానంలో తీసేసి ఎల్-1 పరికరాలను ఉపయోగించాలని ఆదేశాలను జారీ చేసింది. జూలై 1 తర్వాతే అమలు చేయాలని ఆదేశాలు జారీచేసిన ప్రభుత్వం సెప్టెంబరు వరకు గడువు విధించింది. ప్రతి మీసేవ కేంద్రం నిర్వాహకులు వీటిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది.


సిద్దిపేటలోని మీ సేవలో క్యూఆర్ కోడ్‌తో రుసుము చెల్లిస్తున్న వినియోగదారుడు

### నిర్వహణ కష్టమవుతోంది

ప్రభుత్వ నిబంధనలతో పెరుగుతున్న నిత్యావసర ధరలు, కరెంటు బిల్లులు, అద్దెలతో మీ సేవ కేంద్రాల నిర్వహణ కష్టతరమవుతోందని నిర్వాహకులు వాపోతున్నారు. నిబంధనలకు అనుగుణంగా సేవలందిస్తే ప్రభుత్వం రూ.10 కమీషన్ అందించింది. నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు 2017లో రూ.10 కమీషన్‌ను రూ.15కు పెంచింది. కరోనా కంటే ముందు, తర్వాత అన్నిరకాల ముడి సరుకుల ధరలు, అద్దెలు పెరగడంతో జీవనం సాగించడం ఇబ్బందిగా ఉంది. కొత్త నిబంధనలతోపాటు కమీషన్ పెంచి, ఉచిత కరెంట్, ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి.

### ఉచిత విద్యుత్ ఇవ్వాలి

మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు ఉచిత విద్యుత్‌తోపాటు ఇంటర్నెట్, స్టేషనరీ సౌకర్యం కల్పించాలి. గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన పహణీలు, 1బీ వంటి సేవలు ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రద్దు చేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. మహిళా సంఘాల ద్వారా సేవలు అందించడంతో జీవనోపాధి దెబ్బతింటోంది.

- నగేష్, మీసేవ కేంద్రం నిర్వాహకుడు, నంగునూర్

### ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి

మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారానే డబ్బులు చెల్లించాలి. ఈ విధానాన్ని అన్ని మీ సేవ కేంద్రాల్లో అమలుచేస్తాం. వినియోగదారులు పొందిన సేవలకు క్యూఆర్‌కోడ్ ద్వారానే రుసుము చెల్లించాలి. మీ సేవ కేంద్రాల నిర్వాహకులు సెప్టెంబర్ వరకు బయోమెట్రిక్ ఎల్-1 పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి.

- ఆనంద్, ఈడీఏ

## బతుకుదెరువు కోసం వెళ్తే.. చిన్నారిని చిదిమేసిన వీధి కుక్కలు

● కుటుంబంలో విషాదం


పిల్లలతో వెంకటలక్ష్మి, భరత్ దంపతులు

మిరుదొడ్డి, జులై17: బతుకుదెరువు కోసం నగరానికి వెళ్లిన కుటుంబంలో విషాదం నెలకొంది. పుట్టిన గ్రామాన్ని విడిచి పని వెతుక్కుంటూ మహానగరానికి వెళ్లిన కుటుంబాన్ని విధి చిన్న చూపు చూసింది. ముక్కు పచ్చలారని పసికందును వీధి కుక్కలు తీవ్రంగా గాయపరిచి పొట్టనపెట్టుకున్నాయి. తల్లి ఒడిలో హాయిగా నిద్రించాల్సిన చిన్నారికి అప్పుడే నూరేళ్లు నిండాయి. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి రక్తమోడుతున్న తమ బిడ్డను చూసి తల్లిదండ్రులు గొండెలవిసేలా రోదించారు. తమ బిడ్డ ప్రాణాలను కాపాడుకునేందుకు తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలు నీరుగారిపోయాయి. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లో కుక్కకాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన నిహాన్ (18నెలలు) అంత్యక్రియలు బుధవారం మిరుదొడ్డిలో ముగిశాయి. మిరుదొడ్డి పట్టణానికి చెందిన వెంకటలక్ష్మి, భరత్‌లు బతుకు దెరువు కోసం నెల క్రితమే జవహర్‌నగర్ వలస వెళ్లారు. ఇంటి బయట ఆడుకుంటున్న వారి కుమారుడు నిహాన్‌ను మంగళవారం వీధికుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల దాడిలో గాయాలపాలై, చికిత్స పొందుతున్న నిహాన్ అదే రోజు రాత్రి మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని మిరుదొడ్డికి తీసుకుని వచ్చి అంత్యక్రియలు జరిపారు.

### కుటుంబానికి న్యాయం చేయాలి

జవహర్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలదాడిలో చనిపోయిన చిన్నారి విహాన్ కుటుంబానికి అండగా ప్రజాసంఘాలు, బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు పలువురు హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం బుధవారం ఎదుట ఆందోళనకు దిగారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్లే చిన్నారి కుక్కల బారిన పడ్డాడని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రూ. 20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, డబుల్‌బెడ్‌రూం లేదా ప్లాట్ అందించాలంటూ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మేడ్చల్ కలెక్టర్‌కు నివేదిక అందించామని, తక్షణ సాయం కింద బాధిత కుటుంబానికి రూ. 50 వేలు అందించేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఇదే విషయమై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ చిన్నారి కుటుంబానికి తక్షణ సాయం కింద రూ. 50 వేలు అందిస్తామని, కుటుంబంలోని ఒకరికి మున్సిపల్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగంతో పాటు ప్లాంట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

# త్యాగానికి ప్రతీక మొహర్రం

● గ్రామగ్రామాన పీరీల ఊరేగింపు

● దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్న ప్రజలు

మద్దూరు, జూలై 17: మండలంలో మొహర్రంను బుధవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రేబర్తి గ్రామంలో పీరీలను నిలబెట్టిన ప్రదేశాల్లో దూలా ఆటపాటలతో, డప్పుచప్పుళ్లతో సందడి చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల మహేష్, మాజీ సర్పంచ్ భీంరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మంతపురి భూమయ్య, రేబర్తి మాజీ ఉపసర్పంచ్ గవ్వల గణేష్‌తో పాటు పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** మొహర్రంను చేర్యాల, కొమురవెల్లి మండలాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలోని పీరీలను డప్పుచప్పుళ్ల హోరు, నినాదాల నడుమ వీధులగుండా ఊరేగించారు.

● **వర్గల్:** మండల కేంద్రమైన వర్గల్ గ్రామంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రంను ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మొహర్రం పండుగ సందర్భంగా ముస్లింలు, హిందువులు పీర్లను డప్పు చప్పుళ్లతో ఇంటింటికీ ఊరేగించారు.

● **కుకునూరుపల్లి:** మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రంను కుకునూరుపల్లి మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. లకుడారంలో పీరీల కొట్టం దగ్గర అగ్నిగుండం ఏర్పాటు చేసి ఆటపాటలతో అగ్నిగుండాల చుట్టూ ఆడుతూ మొక్కులను చెల్లించుకున్నారు.

● **జగదేవ్‌పూర్:** మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దౌలాపూర్, ఇటిక్యాల, తిగుల్, అలిరాజ్‌పేట, జగదేవ్‌పూర్, చాట్లపల్లి తదితర గ్రామాల్లో పీర్లను పూలమాలలతో అందంగా అలకరించి దట్టీలు కట్టి డప్పు చప్పుల్ల మధ్య ఆల్వ ఆడుతూ పాటలు పాడారు.



మద్దూరు: మండలంలోని రేబర్తిలో తలలు కొట్టుకుని నేలవాలుతున్న పీరీలు



చేర్యాల: కొమురవెల్లి మండలం గురువన్నపేటలో పీరీల ఊరేగింపు

● **బెజ్జంకి:** బెజ్జంకి మండలంలోని పలు గ్రామాల్లో మొహరంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీలకు దట్టీలు కట్టి, కుడక పేర్లు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

● **చిన్నకోడూరు:** మండలంలోని పలు గ్రామాల్లో మొహరంను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పీరీలకు దట్టీలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

● **కొండపాక:** మొహర్రంను మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్లకు దట్టీలు కట్టి, ఊదు బెల్లం చదివించారు.



హుస్నాబాద్: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో పీరీల ఊరేగింపు



వర్గల్: నెంటూర్ గ్రామంలో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు



చిన్నకోడూరు: మండలంలోని పెద్దకోడూరులో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు



కొండపాక: మండలంలోని దుద్దెడలో పీర్లకు దట్టీలు కడుతున్న మహిళలు



జగదేవ్‌పూర్: మండలంలోని దౌలాపూర్‌లో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్థులు

## బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, జూలై 17: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన (కేడీసీసీబీ) బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలో కేడీసీసీబీ బ్యాంకు నూతన భవన నిర్మాణానికి బుధవారం పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావుతో కలిసి భూమి పూజ చేసి మాట్లాడారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంకు నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. గతంలోనే సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులు, ఖాతాదారుల కోసం పెట్రోల్ బంక్, షాపింగ్ కాంప్లెక్స్, మినీ కన్వెన్షన్ హాల్ నిర్మించి సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎంలు మహేష్, హన్మంతరావు, బ్యాంకు మేనేజర్ ప్రవీణ్, వైస్ చైర్మన్ రమేష్, పాలకవర్గ సభ్యులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డిని కలిసిన నాగపురి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రాజలింగం, కిరణ్‌కుమార్

చేర్యాల, జూలై 17: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని బుధవారం మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనగామ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. వీరివెంట మాజీ సర్పంచ్ లింగం ఉన్నారు.

## భగీరథ పైపులైన్ ధ్వంసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

నర్సాపూర్, జూలై 17: నర్సాపూర్ పట్టణ పరిధిలో మంచినీరు సరఫరా చేసే మిషన్‌భగీరథ పైపులైన్‌ను ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా జేసీబీతో ధ్వంసం చేసి పలు వార్డులకు నీరు సరఫరా కాకుండా నష్టం కలిగించిన హైదర్‌బేగ్ అనే వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జైతురాంనాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నర్సాపూర్ పట్టణానికి చెందిన హైదర్‌బేగ్ అనే వ్యక్తి తన వ్యవసాయ పొలానికి పైపులైన్ వేసే క్రమంలో మిషన్‌భగీరథ పైపులైన్‌ను ధ్వంసం చేయడంతో పట్టణంలోని పలు వార్డులకు నీరు సరఫరా నిలిచిపోయిందన్నారు. ఈ విషయమై సదురు వ్యక్తిని పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించాలని మున్సిపల్ కోరగా అందుకు నిరాకరించడంతో పాటు ఇష్టానుసారంగా మాట్లాడినందున అతడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## కార్పొరేషన్ చైర్మన్లకు ఎంపీ సన్మానం



మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారదను సన్మానిస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నారాయణఖేడ్, జూలై 17: రాష్ట్ర ఎంబీసీ చైర్మన్‌గా బాధ్యలు స్వీకరించిన జైపాల్‌ను, మహిళా కమిషన్ చైర్మన్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన నేరేళ్ల శారదను బుధవారం హైదరాబాద్‌లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్‌లు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు కైలాస శ్రీనివాస గుప్తాలు వారి కార్యాలయాల్లో శాలువాలు వేసి పుష్పగుచ్ఛలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంబీసీలకు సంబంధించిన, మహిళలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

## హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నాయకులు

జిన్నారం, జూలై 17: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును బీఆర్ఎస్ మండల నాయకులు కలిశారు. బుధవారం నియోజకవర్గ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన్ను మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు కలిశారు.

## ఐదోరోజుకు రైతుల దీక్ష

నర్సాపూర్, జూలై 17: ఓ వైపు తొలి ఏకదశి, మరోవైపు మొహర్రం పండుగలు ఉన్నా రైతులు మాత్రం తమకు న్యాయం చేయాలంటూ చేపట్టిన దీక్షను ఐదో రోజు కూడా కొనసాగించారు. సంగారెడ్డి రీచ్ కెనాల్ కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు సరైన పరిహారం లేక భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్ష బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. బ్రాహ్మణపల్లి, చిన్నచింతకుంట గ్రామానికి చెందిన రైతులు రామకిషన్, కొండల్, నర్సింహారెడ్డి, మహేష్‌గౌడ్, స్వామి, అర్జున్, స్వామి, శ్రీకాంత్‌రెడ్డి, నగేష్‌గౌడ్‌తో పాటు రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యాదాగౌడ్ దీక్షలో పాల్గొన్నారు.

## రుణమాఫీ ఓకే.. మీ రాజీనామా మాటేమిటి

● హరీశ్‌రావుకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

పాపన్నపేట, జూలై 17: రుణమాఫీ ఓకే సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట నిలబెట్టుకోండి అంటూ మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. మండల కేంద్రం పాపన్నపేటలో బుధవారం ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మెదక్ ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీటిని ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తుందన్నారు. పంద్రాగస్టు లోపు రెండు లక్షల రుణమాఫీని అమలు చేస్తున్న ఘనత సీఎంకే దక్కిందన్నారు. ప్రభుత్వానికి ఇబ్బందులు ఉన్నప్పటికీ మాట నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రుణమాఫీ అమలు చేస్తే రాజీనామా చేస్తానని చెప్పిన సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు మాట తప్పుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాలు రైతులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. హామీలు అమలవుతున్న తీరును చూస్తున్న ప్రతి పక్షాలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. దమ్ముంటే రుణమాఫీ కాగానే రాజీనామా చేసి చూపాలని సవాలు విసిరారు. కావాలనే విద్యుత్ కోతలు సృష్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అంతకుముందు బాచారం గ్రామంలో ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన నలుగురు కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్, గోవింద్ నాయక్, శ్రీకాంతప్ప, గౌస్, నరేందర్‌గౌడ్, సత్యాగౌడ్, రమేష్ గుప్తా తదితరులున్నారు.

### జుక్కల్ ఎమ్మెల్యేను సన్మానించిన సీడీసీ చైర్మన్

నారాయణఖేడ్, జూలై 17: కామారెడ్డి జిల్లా మాగీలోని జీఎస్ఆర్ చక్కెర కర్మాగారం సీడీసీ చైర్మన్‌గా నియామకం అయిన నారాయణఖేడ్‌కు చెందిన శాదుల్ బుధవారం కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావును కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించారు. సీడీసీ చైర్మన్‌గా తన నియామకానికి సహకరించినందుకు ఆయన ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఫారూఖ్, తదితరులు ఉన్నారు.

### ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నాగల్‌గిద్ద, జూలై 17: ఇటీవల నాగల్‌గిద్ద పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సాయిలును బుధవారంస్థానిక పోలీస్‌స్టేషన్‌లో నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాణిక్ రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరినాథ్, నాయకులు గుండేరావు, అనిల్‌పాటిల్, సంజీవ్‌పాటిల్, శ్రీకాంత్‌స్వామి, సచిన్‌పాటిల్, అంబరీష్, అంబాజీ, సంతోష్, హనుమంతు పాల్గొన్నారు.

### బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు..

హత్నూర, జూలై 17: హత్నూర మండల పరిధిలోని బొక్కలగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను స్థానిక యువకులు బుధవారం పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. కొన్నేళ్లగా ఉపాధ్యాయుడిగా పని చేసి విద్యార్థులను ఎంతో ఉన్నత్తులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఒక్కరే ఉపాధ్యాయుడైనప్పటికీ ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక యువకులు శంకర్, గోపాల్, శ్రీశైలం, కృష్ణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 'చలో యాదగిరిగుట్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయండి'

కంది, జూలై 17: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగ పిలుపు మేరకు రేపు యాదగిరిగుట్టలో నిర్వహించనున్న హలో మాదిగ-చలో యాదగిరిగుట్ట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంగారెడ్డి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వావిలాల శంకరయ్య మాదిగ కోరారు. కందిలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల, గ్రామశాఖ ఇన్‌చార్జిలు పెద్దఎత్తున యాదగిరిగుట్టకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

### గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

హత్నూర, జూలై 17: మండల పరిధిలోని సాదుల్లానగర్ గ్రామానికి మంజూరైన నిదులతో బుధవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రె కృష్ణ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక యువకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### రుణమాఫీ జీవో సవరించాలి

నారాయణఖేడ్, జూలై 17: ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి విడుదల చేసిన జీవో 567ను సవరించాలని సీపీఎం జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ జీవోప్రకారం అమలు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అందువల్ల జీవోను సవరించి అర్హులైన వారందరికీ రూ.2 లక్షల రుణమాఫీని వర్తింపచేయాలన్నారు.

# ఆలయాలకు పోటెత్తిన భక్తులు

● తొలి ఏకదశి సందర్భంగా ప్రత్యేక పూజలు

చేర్యాల, జూలై 17: తొలిఏకాదశి పర్వదినాన్ని చేర్యాల, కొమురవెల్లి మండలాల ప్రజలు భక్తిప్రపత్తులతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణుడికి విశేష పూజలు చేశారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు వైష్ణవ సంబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **మద్దూరు:** మండలంలోని అన్ని గ్రామాల్లో తొలి ఏకాదశిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మద్దూరు గ్రామంలోనీ రామాలయంలో ఆలయ అర్చకులు పానుగంటి తిరుపతయ్య వైదిక నిర్వాహణలో సీతారామాంజనేయస్వామి, యోగి రామలింగేశ్వరస్వామితో పాటు ఆంజనేయ స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



సిద్దిపేటలో మోహనిపుర వేంకటేశ్వర ఆలయంలో దండంపెడుతున్న యువతలు



మర్కుక్: పాండురంగాశ్రమంలో సంగీత విభావరి

● **వర్గల్:** వర్గల్ మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో తొలి ఏకాదశిని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో తొలి ఏకదశిని ఘనంగా జరుపుకున్నారు. దుబ్బాకలోని శ్రీవెంకటేశ్వరాలయం, హనుమాన్, చౌదర్‌పల్లిలోని శ్రీదుబ్బరాజేశ్వరాలయం, మోతెలోని శ్రీవెంకటేశ్వరాలయం, కూడవెల్లి రామలింగేశ్వరాలయాల్లో భక్తులు పూజలు చేశారు.



చేర్యాల: వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

● **మర్కుక్:** మండలంలోని పాండురంగ ఆశ్రమంలో తొలి ఏకాదశిని ఘనంగా జరిపారు. ఉదయం నుంచే స్వామి వారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కొడకండ్ల రాధాకృష్ణశర్మ బృందం, చుంచనకోటకు చెందిన లలితామతి శర్మ భక్తి సంగీత విభావరిలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరలు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు, పురోహితులు అప్పాల సత్యనారాయణ శర్మ, విట్టలశర్మ, రసరాజుశర్మ, మదునూరి వెంకటరామశర్మ, మాదవశర్మ, రాధాపతిశర్మ, బావానందశర్మ, శశిధరశర్మ, శ్రీధర్‌శర్మ భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

## అంబులెన్స్ తనిఖీ



పరికరాలను పరిశీలిస్తున్న జనార్ధన్

దౌల్తాబాద్, జూలై 17: మండలంలోని 108 అంబులెన్స్‌ను బుధవారం జిల్లా ప్రోగాం మేనేజర్ జనార్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేసి అత్యవస మందులు, పరికరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ భాను, పైలెట్ జనార్ధన్‌లను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 సిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిచాలని 108 సిబ్బందికి సూచించారు.కార్యక్రమంలో జిల్లా కోర్డినేటర్ వెంటేష్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు జీపీ అనంతులకు సన్మానం



దుర్గమ్మ ఆలయంలో హైకోర్టు జీపీ అనంతుల రవీందర్‌ను సన్మానిస్తున్న స్థానికులు

చేర్యాల, జూలై 17: చేర్యాల పట్టణానికి చెందిన అనంతుల రవీందర్ ఇటీవల రాష్ట్ర హైకోర్టు జీపీగా నియమితులవడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ స్థానికులు బుధవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా స్థానిక దుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు సన్మానించారు. కార్యక్ర మంలో పుర్మ వెంకట్‌రెడ్డి, ఆడెపు చంద్రయ్య, పాల లక్ష్మీనారాయణ, యాట యాదగిరి, అవుశర్ల యాదయ్య, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

## అండగా ఉంటాం: శ్రీకాంత్‌రావు

గజ్వేల్, జూలై 17: యాదగిరి కుటుంబానికి అండగా ఉంటామని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. గజ్వేల్ మండలం జాలిగామకు చెందిన మంగళి యాదగిరి కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబాన్ని బుధవారం శ్రీకాంత్‌రావు పరామర్శించారు. ఆయనవెంట టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి ఉన్నారు.

# ఉపాధ్యాయుల రిలీవ్‌లో జాప్యాన్ని నివారించాలి

● టీఎస్‌యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ

సిద్దిపేట టౌన్, జూలై17: బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయుల రిలీవ్‌లో జాప్యాన్ని నివారించాలని టీఎస్‌యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట పట్టణంలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు బుధవారం సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డికి వివిధ అంశాలపై వినతిపత్రం అందజేసి, పలు అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాలో ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని, కొన్ని మండలాల్లో మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమన్వయం లోపం కారణంగా, కొంతమంది ఎస్జీటీ ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ విడుదల కాకుండా అదే పాఠశాలలో పనిచేయాల్సి వస్తున్నదని విమర్శించారు. బదిలీ అయినా ప్రయోజనం లేకుండా పోయిందని కొంతమంది ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఉపాధ్యాయులు, పాఠశాల వివరాలు డీఈవోకు అందజేసినట్లు చెప్పారు. విడుదలలో జాప్యాన్ని నివారించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డీఈవోకు తెలియజేశామన్నారు. పదోన్నతులు, బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీల వివరాలను తెలియజేయాలని, డీఈవోను కోరినట్లు తెలిపారు. వేసవి సెలవుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరుకి సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సి. చంద్రారెడ్డి, చిర్ర యాదగిరి, ఎం. కృష్ణ, కే. కనకరాజు, జి. వెంకటకిరణ్, ప్రశాంత్‌కుమార్, టి. శివలింగం, ఎస్. వెంకటేశం, సీహెచ్. రామచంద్రం, ఎండీ. సాబీర్, బి. రాజేందర్, యాదయ్య, కే. శ్రీనివాస్, డి. రాజలింగం, జి. బిక్షపతి, వై. శ్రీనివాస్, కే. నరసింహులు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



డీఈవో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

# సొంత భవనంలోకి కొమురవెల్లి పోలీస్‌స్టేషన్

● ఏడున్నరేళ్లుగా మల్లన్న ఆలయ గెస్ట్‌హౌజ్‌లో..

● మూఢనమ్మకాల కారణంగా జాప్యమని ఆరోపణ

చేర్యాల, జూలై 17: కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ ఇక నుంచి నూతన భవనంలో కొనసాగనుంది. ఎన్నో ఒడిదుడుకులు, అడ్డంకుల నడువ సొంత భవనంలోకి చేరింది. ఈమేరకు బుధవారం ఎస్ఐ రాజుగౌడ్ నూతన భవనంలో శాస్త్రోక్తయుక్తంగా పూజలు నిర్వహించి కార్యకలాపాలు ప్రారంభించారు. 2016లో అప్పటి ప్రభుత్వం నూతన మండలాలు ఏర్పాటుచేసిన క్రమంలో చేర్యాలను విభజించి కొమురవెల్లి నూతనమండలాన్ని ఏర్పాటు చేసింది. సొంత భవనం లేకపోవడంతో కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిధిలోని గెస్ట్‌హౌజ్‌ను పోలీస్ స్టేషన్ కోసం కేటాయించారు. దీంతో 2016, అక్టోబరు 12న అప్పటిమంత్రి హరీశ్‌రావు పోలీస్‌స్టేషన్ ప్రారంభించి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఐనాపూర్ దారిలోని ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడంతో రూ.1కోటి వ్యయంతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. సుమారు ఏడాదిన్నరక్రితమే పనులు పూర్తవగా, గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భవనంలో చనిపోయాడు. ఇదేక్రమంలో భవన ప్రారంభానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మూఢనమ్మకాలు అపోహలని, ఏమాత్రం పట్టించుకోవద్దని కనువిప్పు కలిగించే పోలీసులు వ్యక్తి చనిపోయాడన్న మూఢనమ్మకం కారణంగానే స్టేషన్ ప్రారంభంలో జాప్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయా అంశాల పరిగణన దృష్ట్యా పోలీసు ఉన్నతాధికారుల సూచనాను సారం ఆలయ గెస్ట్‌హౌజ్ నుంచి నూతన భవనంలోకి ఫర్నీచర్, ఇతరత్రా సామగ్రి తరలించి కార్యకలాపాలు ప్రారంభించారు. ఇదిలా ఉండగా, త్వరలో ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారుల చేతులమీదుగా అధికారికంగా ప్రారంభిస్తారా? లేదా ఇలానే కొనసాగిస్తారా అన్న విషయం ఆసక్తికరంగా మారింది.



ఎస్ఐని ఆశీర్వదిస్తున్న వేదపండితులు

# సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

● రుణమాఫీపై నాయకుల హర్షం

చిన్నకోడూరు, జూలై 17: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని కాంగ్రెస్ నాయకులు మీసం నాగరాజు, మహేందర్ పేర్కొన్నారు. ఈనెల 18 (నేడు) నుంచి రైతు రుణమాఫీ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం చిన్నకోడూరులో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, పీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ కుమార్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు రుణమాఫీతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తిని గణేష్, రాజు, జయంత్, ప్రశాంత్, చాంద్‌పాషా, వెంకట్, సలీం, గణేష్, మల్లేశం, రాజు, సంపత్, చందు, రమేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామీణ వైద్యులు

● **మర్కుక్:** ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 లోపు కాంగ్రెస్ 2 లక్షల రుణమాఫీ చేస్తున్నదని, దీనివల్ల ఎంతో మంది రైతులకు మేలు జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు టప్ప రాజు పేర్కొన్నారు. మండలంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే ఇందిరమ్మ ఇల్లు కూడా వస్తాయన్నారు. రుణమాఫీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### గ్రామీణ వైద్యులు..

హుస్నాబాద్, జూలై 17: గ్రామీణ వైద్యులకు కొంత పారితోషికం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం పట్ల బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కరోనా విపత్తులో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించిన ఘనత ఆర్ఎంపీ, పీఎంపీలదని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు పారితోషికం ఇవ్వడానికి ముందడుగు వేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు గీకురు వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు సుదర్శన్, బంక చందు, బింగి శ్రీనివాస్, ముంతాజ్, కోడం అంజనేయులు, కన్నారం శ్రీను, ప్రకాష్, కృష్ణ, రఘురాములు, ప్రభు, నూతి రాజేశం తదతరులున్నారు.



చిన్నకోడూరు: సీఎం, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు